# కానివాడ నరబలిపై దర్యాప్తునకు ఆదేశం

రంపచోడవరం, ఫిబ్రవరి 4 (న్యూస్‌టుడే): గత ఏప్రిల్‌లో జరిగిన కానివాడ నరబలి సంఘటనపై అధికార దర్యాప్తు జరప వలసిందిగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరక్టర్ స్థానిక సమగ్ర గిరిజనాభివృద్ధిసంస్థను ఆదేశించినట్లు తెలిసింది. ఈ కేసుతాలూకు వివరాలు సేవాసంస్థ "శక్తి" ద్వారాసమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థతెలుసుకున్నవిషయం తెలిసిందే.

నరబలి జరిపారన్న ఆరోపణపై అయిదుగురు గిరిజనులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. వీరు చెప్పిన ప్రకారం ఒకచోట పాతిన శవాన్ని వెలికి తీసి శవ పరీక్ష జరిపారు. ఇది ఒక స్త్రీ శవంగా పరీక్షలో వెల్లడయిందని కాకినాడ ఫోరెన్సిక్ ప్రొఫెసర్ పేర్కొన్నట్లు తెలిసింది. అయితే ఇంతకీ బలయిన గొర్రె చెంచయ్య ఏమయినట్లు? చెంచయ్యను బలి ఇచ్చినట్లు ముద్దాయిలు ఒప్పుకోవటంతో పాటు ఆ ఆరోపణలు రుజువయి ఛార్జి షీటు దాఖలు కానున్న దశలో శవ పరీక్ష నివేదిక విరుద్ధంగా రావటంతో పోలీసులు తికమక అవుతున్నారు.

శవ పరీక్ష నివేదికలో ప్రొఫెసర్ ఏమయినా ఒత్తిడులకు తలవొగ్గారా? అన్న ప్రశ్న కొందరికి కలుగుతోంది. శవాన్ని పూడ్చి పెట్టిన గోతిలో ముద్దాయిలు మొదట చెప్పిన ప్రకారం సూది, దారం, పాత గుడ్డలు దొరకటాన్ని ఈ సందర్భంగా కొందరు పేర్కొంటున్నారు. రక్తం ఎక్కువగా కారకుండా పాత గుడ్డలను, సూది, దారాన్ని ఉపయోగించటానికే వారు వీటిని సిద్ధం చేసుకున్నట్లు మరి కొందరు అంటున్నారు. ఇదిలా ఉండగా సేవాసంస్థ 'శక్తి' సమగ్రగిరిజనాభివృద్ధిసంస్థకు అందజేసినవివరాల ప్రకారం అసలు కానివాడ గ్రామంలో నరబలే జరగలేదని ఆ గ్రామ గిరిజనులు చెబుతున్నట్లు తెలుస్తోంది. పోలీసులు బెదిరించి, హింసించి, ఆ కేసును తమతో అంగీకరింప చేసినట్లు కానివాడ ప్రజలు "శక్తి" సంస్థ వారికి చెబుతున్నారట. గొర్రె చెంచయ్య శవంగా చూపించి పోలీసులు తీసుకుపోయింది ఒక యువతి శవం అని గ్రామస్థులు చెప్పినట్లు శక్తి పేర్కొంది. నరబలి జరిగిన తరువాత పోలీసులు తప్ప అధికారులెవరూ కానివాడ గ్రామం వెళ్ళక పోవటం గమనార్హం.